**108**
**ధారావాహిక**



# జాయ సేనాపతి

## చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి ...
99893 71284

**జరిగిన కథ :** అది మువ్వ మరణించిన రోజు. ఆ విషాదాన్ని తట్టుకుంటూనే తలగడదీవి చేరాడు జాయపుడు. పృథ్వీశ్వరుడు ద్వారం వద్దే నిలిచి.. అనుమకొండ నుంచి వచ్చిన లేఖను చూపాడు. అసలే మువ్వ మరణంతో దిమ్మెరబోయిన జాయచోడుడు.. ఇక క్షణం ఆగలేదు. విక్రమతో కలిసి గిరుక్కున వెనుదిరిగాడు. చీకట్లో అలా అలా.. నడిచి నడిచి ఊర్లు దాటారు. అప్పుడు వినిపించింది.. డప్పు చప్పుడు. అది సూరప్పడి డప్పు.

**ఇక్కడెక్కడో..** ఏ ఊరు ఇది?! ఇక్కడున్నాడేమిటి? ఆవలగా మిణుకుమిణుకు అంటున్న దీపాల కదలికలు. కాస్త అవతలగా కృష్ణమ్మ నిద్రలో గురక లాంటి మెలమెల్లని గలగలలు. నడుస్తూనే చుట్టూ పరికిస్తూనే ఆ డప్పుశబ్దం వైపుగా నడిచాడు. దగ్గరయ్యాక సూరపను గుర్తించి.. ఆశ్చర్యంగా నిలబడిపోయాడు. అది ఓ పంచములవాడ పొలిమేర లోని తాడితోపు. ఓ తాడిచెట్టు కింద కూర్చుని ఉన్నాడు సూరప. ఒంటిపై వస్త్రం లేదు. కేవలం మొలకు ఓ గోచి గుడ్డ. ఆ దట్టమైన చీకటిలో ఒంటరిగా చెట్టుకు జారగిలబడి అత్యంత విషాద రాగాలను వాయిస్తున్నాడు మంద్రంగా..

ఇద్దరూ ఒక్కసారే ఒకరినొకరు చూసుకున్నారు. చటుక్కున లేచి నిలబడ్డాడు సూరప.

''దేవరా దండాలు! సావీ దండాలు! ఈ యదవ ఈడ ఉండాడని వచ్చారా దేవరా!'' ఘొల్లుమన్నాడు.

జాయచోడుడు వెలనాడు విడిచి వెళ్లిపోతున్నాడని అతనికి తెలియదు కదా!

''నువ్వేమిటి.. ఇక్కడ?? సరే సరే అసలు సంగతి చెప్పు.. అనుమకొండ వెళ్లావా? రాజాస్థానానికి వెళ్లావా? నాలేఖ చూపావా? రాజాస్థానంలో డప్పుప్రదర్శన చేశావా? పెద్దలంతా ఏమన్నారు? మెచ్చుకున్నారా? బావగారు.. అదే మహామండలేశ్వరులు నీ కళను విని ఏమన్నారు..?''

ప్రశ్నల వర్షం. దేనికీ జవాబు చెప్పలేనట్లు జాయపుని పాదాలవద్ద కుప్పకూలిపోయి.. ముఖాన్ని చేతులతో కప్పుకొని కుళ్లికుళ్లి ఏడవసాగాడు. మ్రాన్పడిపోయాడు జాయపుడు. శుభవార్త కాదు.. ఏదో ఘోరం జరిగినట్లుంది. లేపి భుజాన చేయివేసి లాలనగా అడిగాడు.

''ఏమైంది.. చెప్పు. దేనికైనా.. ఏ మాట వినడానికైనా సిద్ధపడి ఉన్నాను. చెప్పు చెప్పు..''

చెప్పలేనట్లు మరికాసేపు ఏడ్చి తెప్పరిల్లి లేచి మళ్లీ జాయపుని పాదాలవద్ద కూలబడి చెప్పాడు.

''తమరి లేఖ సూసి నన్ను సాదరంగా రానిచ్చారు. కళామండపమంట. ఆడ.. పెద్దోళ్ల ముందు నేను డప్పు వాయిస్తన్నాను. మీమీద గురితో నన్ను వాయించమన్నారు కానీ.. ఆళ్లంతా నన్ను రోతగా చూస్తన్నారు. నన్ను, నా డప్పువాదనను ఏమాత్రం ఒప్పుకొనే ధోరణి ఆళ్ల ముఖాల్లో కనపడ్డంలేదు. ఇష్టంలేనట్టు.. అసలు ఆళ్లకు సంగీతమే తెలియనట్లు కూకున్నారు. నన్ను గౌరవించడం సంగతి దేవుడెరుగు.. అసలు ఇనడమే లేదు. నాలో ధైర్యం తగ్గిపోతాంది. డప్పు శ్రుతి తప్పుతాంది. సరిగ్గా అప్పుడే ఆ దేవుడు.. ఆ పెద్దాయన లోపలికొచ్చారు. ఆయన యంట వచ్చినోళ్ల పొగడ్తలతో డప్పు ఆపేశాను. అప్పుడే ఎవరో నా కాడికొచ్చి.. 'కాసేపు నీ డప్పు ఆపరా మాదిగ యధవా! శవాల ముందు వాయించే డప్పు.. రాజనగరిలో మహామండలేశ్వరుల ముందు.. మాబోటి మహావిద్వాంసుల ముందు వాయిస్తావా!? ఎంత ధైర్నం.. సావడానికే ఇక్కడికి వచ్చావ్. ఆపెహే!' అన్నాడు. అట్టాంటోళ్లు సాధారణంగా నా